

భువిపై హరివిల్లు!



రాజమహేంద్రవరంలోని షిరిడిసాయి జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ముగ్గుల పోటీ దృశ్యం

రాజమహేంద్రవరంలో..

- ఆకట్టుకున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ
- షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ముందే వచ్చిన సంక్రాంతి
- మంచి సంప్రదాయాన్ని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కొనసాగిస్తోందన్న వక్తలు
- వారి స్ఫూర్తితోనే రాజమహేంద్రవరంలో పోటీలు నిర్వహిస్తున్నాం..
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల సభలో ఆదిరెడ్డి శ్రీనివాస్
- విజేతలకు నగదు, కన్సొలేషన్ బహుమతులు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: ప్రతి ఏటా మహిళలను ప్రోత్సహిస్తూ ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ద్వారా మంచి సంప్రదాయాన్ని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కొనసాగించడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు సమీపంలోని షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" శనివారం వైభవంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఆదిరెడ్డి భవాని చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరించింది. ఈ పోటీలను షిరిడిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ప్రారంభించగా ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, అలయన్ క్లబ్ ప్రతినిధి, తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యన కుమారిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ అధ్యక్షత వహించగా భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ఈ ఏడాది రాజమహేంద్రవరంలో 40 డివిజన్లకుపైగా సుమారు రూ.8 లక్షల వ్యయంతో మహిళలను ప్రోత్సహిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడానికి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలే స్ఫూర్తి అని అన్నారు. ఆదిరెడ్డి వీరాఘవమ్మ మాట్లాడుతూ తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రతిరోజూ ఇంటి వాకిలి శుభ్రం చేసుకుని ముగ్గులు పెట్టుకునే సందర్భాలను గుర్తుచేశారు. మంచి సంప్రదాయాలను గుర్తుచేస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని అభినందించారు. షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టీ శ్రీవిద్య మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి టీమ్ ఎంతో శ్రద్ధతో ఈ ముత్యాల ముగ్గుల పోటీలను విజయవంతంగా నిర్వహించారన్నారు. తమ విద్యాసంస్థల ప్రాంగణంలో సంక్రాంతి పండుగను వారం ముందుగానే తీసుకువచ్చారని చెప్పారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో సుసంపన్నమైన సంస్కృతి సంప్రదాయాలను ఆంధ్రజ్యోతి ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఏటా ఈ ముగ్గుల పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వస్తున్నామని ఆయన చెప్పారు. ముగ్గుల పోటీల న్యాయనిర్ణేత మాటూరి మంగతాయారు మాట్లాడుతూ మహిళలను ముగ్గుల పోటీల ద్వారా ఉత్సాహపరుస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని అభినందించారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రథమ బహుమతి విజేత రాజమహేంద్రవరానికి చెందిన డి నాగజ్యోతికి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి విజేత ధవళేశ్వరానికి చెందిన కె.లక్ష్మికి రూ.4 వేలు, మూడో బహుమతి విజేత టి.ఆదిశ్రీకి రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. అలాగే కన్సొలేషన్ బహుమతులు మరో 12 మంది మహిళలకు అందజేయగా, పాల్గొన్న అందరికీ గిఫ్టులను అందించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి జిల్లా ఇన్‌చార్జి ఎన్ఎన్ఎన్ సత్యనారాయణ, ఏబీఎన్ జిల్లా ఇన్‌చార్జి కె రాజబాబు, సర్క్యులేషన్ జిల్లా మేనేజరు గోపాలకృష్ణ, యాడ్స్ జిల్లా మేనేజర్ కృష్ణారావు, సబ్ ఎడిటర్ కిరణ్, ఆంధ్రజ్యోతి పాత్రికేయులు ఎంటీవీ సారథి, రామచంద్రరావు, కె శ్రీకాంత్, బెజవాడ శంకర్, ఏబీఎన్ కెమెరామన్ ఎం సతీష్, ఫొటోగ్రాఫర్ రాంబాబు, త్రీజీ కిట్ చందు, యాడ్స్ సిబ్బంది బి సుబ్రహ్మణ్యం, రవీంద్ర, కిరణ్‌కుమార్, విజయేంద్రనాథ్, సర్క్యులేషన్ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బాషా, ఎస్ఆర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో నాకు ప్రథమ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి యేడాది ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. మహిళలకు సంప్రదాయాల పట్ల మక్కువను పెంచుతోంది. ఈ ఏడాది పోటీల్లో నేను ప్రథమ బహుమతి సాధించడం పండుగ గిఫ్ట్‌గా భావిస్తున్నాను. ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు.

- డి. నాగజ్యోతి, రాజమహేంద్రవరం
ప్రథమ బహుమతి విజేత

బహుమతి రావడం సంతృప్తినిచ్చింది

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రతి యేడాది పాల్గొంటున్నాను. ఈ ఏడాది పోటీల్లో ద్వితీయ స్థానం రావడం సంతృప్తినిచ్చింది. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రయార్టీ ప్రకారం ఆఖరిగా అలంకరణను పరిగణంలోకి తీసుకోవడం బాగుంది. క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం పోటీలు నిర్వహించడం బాగుంది.

- కె. లక్ష్మి, ధవళేశ్వరం
ద్వితీయ బహుమతి విజేత



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు









రాజమహేంద్రవరంలో జరిగిన ముగ్గుల పోటీలో మొదటి బహుమతి కింద రూ.6 వేల నగదును విజేత డి నాగజ్యోతికి అందజేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్.. (కింద) మొదటి బహుమతి పొందిన ముగ్గు





ద్వితీయ బహుమతిగా రూ.4 వేల నగదును విజేత కె.లక్ష్మికి అందజేస్తున్న ఆదిరెడ్డి వీరరాఘవమ్మ.. పక్కన తృతీయ బహుమతిగా రూ.3 వేల నగదును విజేత టి.ఆదిశ్రీకి అందజేస్తున్న షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ... (కింద) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గులు

నేడు చంద్రబాబు విమానాశ్రయానికి రాక

రాజమహేంద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఆదివారం రాత్రి మధురపూడి విమానాశ్రయానికి రానున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని, సాయంకాలం 6.30 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గాన రాత్రి 8 గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత 8.10 విమానంలో బయలుదేరి వెళతారు.



అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

ఎంపీ భరత్‌రామ్‌పై చర్యలు తీసుకోండి!

- అడిషనల్ ఎస్పీకి టీడీపీ, జనసేన నేతల ఫిర్యాదు
- ఆదిరెడ్డి కుటుంబంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలకు వినతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న ఆదిరెడ్డి కుటుంబంపై ఎంపీ భరత్‌రామ్ అనుచరులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసత్యాలు ప్రచారం చేస్తూ వారి పరువుకు భంగం కలిగించేవిధంగా ఉన్నందున వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్ సెల్, జనసేన నేతలు రాజమహేంద్రవరంలో జిల్లా అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన అర్బన్ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై శ్రీను, సీపీఎం, సీపీఐ, ఆర్‌పీసీ పార్టీల నాయకులు జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వెళ్లారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ ఎస్పీకి తమ ఫిర్యాదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిలను కించపరుస్తున్నారని, దానికి సంబంధించిన పేపరు క్లిప్పింగ్‌లను వారి ఫిర్యాదుతో అందజేశారు. 2019లో అసెంబ్లీలో నూతన మద్యం పాలసీపై చర్చ జరుగుతుండగా ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిపై అవహేళనగా మాట్లాడారని, దీనిపై గౌరవ స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. అనంతరం రాజమహేంద్రవరంలో దిశ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. అదేవిధంగా ఎంపీ భరత్‌రామ్ పలు మీడియా సమావేశాల్లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను బ్లేడ్ బ్యాచ్‌లను పెంచిపోషిస్తున్నారని వైసీపీ నాయకులు కొంతమంది వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా బ్లేడ్ బ్యాచ్‌లను మెయింటైన్ చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేశారని, అలాగే మరికొందరు సోషల్ మీడియాలో అసభ్యకరమైన పదజాలంతో అవాస్తవ సంఘటనలతో ట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల డ్రగ్ కేసులో దొరికిన ద్వారపూడి విక్రమ్‌రెడ్డి.. ఎంపీ భరత్‌రామ్ ముఖ్య అనుచరుడని వారు ఆరోపించారు. అనేక సందర్భాల్లో వారు కలిసి తిరిగారని, వారిద్దరు చాలా సన్నిహితంగా ఉంటారని అంటున్నారని చెప్పారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పిట్లా ప్రసన్నకుమార్, చిల్లా శ్రీను, పట్నాల శ్రీను, ఎన్ఎస్‌వీవీ ప్రసాద్, డీవీకేఎంఎస్ ప్రసాద్, రాంబాబు, కె కనక లింగేశ్వరరావులు ఏఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలి





సభల్లో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు సత్కారం.. మాట్లాడుతున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

- మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు
- కన్నుల పండువగా 2వ రోజు అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/రాజానగరం/దివాన్‌చెరువు,జనవరి6: తెలుగు భాషా వికాసానికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు స్పష్టం చేశారు. తెలుగు భాషను బతికించుకోవడం, వ్యాప్తి చేయడాన్ని అందరూ బాధ్యతతగా స్వీకరించి తెలుగుభాషా వికాసానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కన్నుల పండువగా కొనసాగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ఈ మహాసభలు జరగడం తెలుగువారికి గర్వకారణం. తెలుగు బలహీన పడుతుందనే భయాందోళనల మధ్య ఇలాంటి తెలుగు మహాసభలను నిర్వహించి తెలుగు భాష పట్ల మమకారాన్ని, అభిమానాన్ని పెంచుతూ భాషా వ్యాప్తికి కృషి చేస్తున్న మహనీయులకు అభినందనలు' అని ఆయన పేర్కొన్నారు. తెలుగులో అనేక రకాల కవితలు, కథలు రాయడం దగ్గరనుంచి గేయాలు, జానపద గేయాలు, హరికథలు, బుర్రకథలు ఇంకా అనేక రకాల ప్రక్రియలు ఉన్నాయన్నారు. వాటిలో గజల్స్‌ని గజల్ శ్రీనివాస్ ప్రజల దగ్గరకు తీసుకొచ్చారని చెప్పారు. త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు కీర్తనలు.. శ్రీనాథుడు, పోతన వంటి మహాకవులు తెలుగు వెలుగుకు చేసిన విశేష కృషి మహాసభల సందర్భంగా గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒకనాడు రాజమహేంద్రవరం అంటే తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి రాజధాని అనే పేరు ఉందని హరిబాబు కొనియాడారు. గోదావరి తీర ప్రాంతంలో అల్లూరి, డొక్కా సీతమ్మ, కందుకూరు వీరేశలింగం పంతులు, మధునాపంతులు, శ్రీపాద, బోయి భీమన్న వంటివారు ఎందరో చిరస్మరణీయులన్నారు. 'శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకూ ఎన్నో నదులున్నాయి. ఇంతటి నీటి సంపద ఉన్న ప్రాంతం తెలుగు వారి ప్రాంతం మాత్రమే. ఇన్ని నదుల్లో గోదావరి నది మహానది. ఆ నది జలాల ద్వారా తెలుగు వారి ఆర్థిక పరిపుష్టికి పునాది వేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్' అని ఆయన కొనియాడారు. 2024వ సంవత్సరం తెలుగు ప్రజలకు మంచి ఉన్నతిని ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారి రచనలను హిందీలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని.. తద్వారా అన్ని భాషల్లోకి వెళ్లి మన భాష గొప్పదనం ప్రపంచానికి తెలుస్తుందన్నారు. తెలుగు వారికే సొంతమైన అవధాన ప్రక్రియను హిందీలోకి తీసుకెళ్లి ఉత్తర భారతదేశంలో హిందీలో అవధాన ప్రక్రియ చేసిన వారు రాజమండ్రి వాసి చేబోలు శేషగిరిరావు అని ఆయన గుర్తుచేశారు. ఆయన విగ్రహం ఏర్పాటుచేయాల్సి ఉందని పేర్కొన్నారు.



అలరించిన తెలుగు తోరణం

ఆకట్టుకున్న నృత్యరూపకం

పులకించిన హృదయాలు

- 7లో

తెలుగుజాతి విలువ పెంపునకు పునరంకితం కావాలి : జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 6: తెలుగు జాతి విలువలను మరింత పెంచేందుకు మనమంతా పునరంకితం కావాలని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. తెలుగు మహాసభల్లో శనివారం రాత్రి తెలుగు తోరణం నృత్యరూపక ప్రదర్శన కన్నుపండువగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుజాతి వైభవాన్ని, విలువలను కళావైభవాన్ని ఒక్క ప్రదర్శనలో చూపారని కొనియాడారు. ప్రస్తుత తరానికి మన జాతి నాయకులు విలువలు, విశిష్టత తెలుసుకోవడానికి చక్కటి అవకాశం దొరికిందన్నారు. ఈ ప్రదర్శన తిలకించినంతసేపు భావోద్వేగానికి లోనయ్యానని చెప్పారు.సినీనటుడు గౌతంరాజు మాట్లాడుతూ ఈ గడ్డ మీద పుట్టడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఈ నృత్య ప్రదర్శన ద్వారా మన తెలుగుజాతి గౌరవాన్ని ఎక్కడికో తీసుకెళ్లారని చెప్పారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, పీఎన్‌బీ హైదరాబాదు జోనల్ మేనేజర్ డీకే శ్రీవాత్సవ్ తదితరులు మాట్లాడారు.

విశిష్ట సేవాపురస్కారాల ప్రదానం

తెలుగు మహాసభల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. చలనచిత్ర రంగంలో సినీనటుడు గౌతమ్‌రాజుకు, పాత్రికేయ రంగంలో వీఎస్ఎస్ కృష్ణకుమార్‌కు, సేవారంగంలో డాక్టర్ మొల్లేటి రామ్మోహన్‌కు, సంగీతంలో పెద్దేహపు సాయిబాబా, తెలుగుభాషా సేవలో ఎస్ఆర్ఎస్ కొల్లూరి, సాహిత్యంలో కేటీ పద్మజకు విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఘనంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి

ముత్యాల ముగ్గులపోటీలు



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు సమీపంలోని షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" శనివారం వైభవంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఆదిరెడ్డి భవాని చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ అధ్యక్షత వహించగా, భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి శ్రీవిద్య, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. అలాగే కన్సొలేషన్ బహుమతులు మరో 12 మంది మహిళలకు అందజేయగా, పాల్గొన్న అందరికీ గిఫ్టులను అందించారు.



రాజమహేంద్రవరంలో షిర్డీసాయి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు

అలరించిన తెలుగు తోరణం

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 6: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలల ప్రాంగణంలో గైట్ విద్యార్థులు శనివారం రాత్రి ప్రదర్శించిన తెలుగు తోరణం నృత్యం రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యార్థులు చేసిన అద్భుతమైన ప్రదర్శనలు అందరినీ మంత్ర ముగ్ధులను చేశాయి. తెలుగు జాతి ఔన్నత్యం, తెలుగు వారి గొప్పతనాన్ని చాటిచెప్తూ మహనీయులందరినీ స్మరిస్తూ తెలుగు తోరణం నృత్య ప్రదర్శన సాగింది. విద్యార్థులు, ప్రేక్షకులు ఉరకలేసే ఉత్సాహంతో కేరింతలు కొడుతూ ఉర్రూతలూగారు. ఆదికవి నన్నయ మొదలుకుని స్వాతంత్ర్య సంగ్రామంలో తెలుగువారి పాత్ర స్వాతంత్ర్యం అనంతరం వివిధ పదవులతో కీర్తి తెచ్చిన తెలుగువారు, తమ కృతులు, కీర్తనలతో ఖ్యాతి తెచ్చిన త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు తదితరులతో పాటు సాహిత్యంలో కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన మహనీయులు, రంగస్థల నటులు, హరికథలు, బుర్రకథలతో ఖ్యాతిగాంచినవారు, సినీ నటులు, రచయితలు, శ్రీకృష్ణదేవరాయుల కొలువు అన్ని కోణాలను, అన్ని రంగాల్లో వన్నె తెచ్చిన తెలుగువారిని స్పృశిస్తూ వారి గురించి వివరిస్తూ సాగిన ఈరూపకం అందరినీ కట్టిపడేసింది. సినీ రచయిత రసరాజు రచించిన ఈ నృత్య రూపకానికి ఘంటసాల పవన్‌కుమార్ నృత్య దర్శకత్వం వహించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ ప్రదర్శనకు గజల్ శ్రీనివాస్ గానం, సంగీతం అందించడంతో పాటు దర్శకత్వం వహించారు. ఈ నృత్యాన్ని వీక్షించిన ప్రముఖుల్లో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పీఎన్‌బీ హైదరాబాదు జోనల్ మేనేజర్ డీకే శ్రీవాత్సవ తదితరులున్నారు. ప్రదర్శన అనంతరం ప్రేక్షులు తమ స్థానాల్లో నుంచి లేచి నిలుచుని చేసిన కరతాళ ధ్వనులతో కళాశాల ప్రాంగణం మార్మోగిపోయింది.

పులకించిన హృదయాలు



నృత్యరూపకం వీక్షిస్తున్న ప్రముఖులు



తెలుగు తోరణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు









ప్రధాన వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక ప్రదర్శనల కోలాహలం

అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 6: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గైట్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల వేడుకల్లో విద్యార్థులు చేస్తున్న పలు సాంస్కృతిక ప్రదర్శనల్లో తెలుగుదనం ఉట్టిపడుతోంది. కవితా పఠనం, కవి సమ్మేళనాలు, పద్య, గద్య ఆలాపనలతో గైట్ ప్రాంగణం మార్మోగిపోతోంది. రెండో రోజు శనివారం రాజరాజ నరేంద్ర వేదికపై లిటిల్ పారడైజ్ స్కూల్, రవీంద్రభారతి విద్యాలయం, అన్నదేవరపేట ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్‌తోపాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తెలుగు భాష, తెలుగుదనం చాటిచెబుతూ చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అబ్బురపర్చాయి. కార్టూనిస్ట్ శేఖర్ తదితరులు కార్టూన్ల ప్రదర్శన, ప్రధాన ప్రాంగణంలో శిల్పి రాజ్‌కుమార్ వడయార్ ఏర్పాటుచేసిన తెలుగుజాతి కీర్తిని పెంచిన వివిధ రంగాల మహనీయుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే నన్నయ వేదికపై బాలసాహిత్యం, భక్తి సాహిత్యంపై సదస్సులు వినసొంపుగా సాగుతున్నాయి. వెయ్యిమంది కవులు కవితా నీరాజనంలో భాగంగా నారాయణ భట్టు వేదికపై కవితా పఠనం వీనులవిందుగా జరుగుతున్నాయి. పలువురు ప్రముఖులు వేదపండితులు, వేలాదిమంది విద్యార్థుల కోలాహలంతో సందడి నెలకొంది.

ఫిబ్రవరి 16 నుంచి అంతర్వేది ఉత్సవాలు

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి



ఉత్సవాల నిర్వహణపై కళ్యాణం మండప ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవోతో పాటు డీసీ విజయరామరాజు, అధికారులు

అంతర్వేది, జనవరి 6: రాష్ట్రస్థాయి అంతర్వేదికగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం షెడ్డులో ఏర్పాటుచేసిన వార్షిక ఉత్సవాల మొదటి సమీక్షా సమావేశం అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో శనివారం జరిగింది. తొలుత ఫిబ్రవరి 16నుంచి 25వరకు నిర్వహించే ఉత్సవాల్లో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లతో ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వహిస్తూ ప్రతీ భక్తునికి స్వామివారి కల్యాణంతోపాటు దర్శనం చేసుకుని సురక్షితంగా ఆధ్యా త్మిక భావంతో ఇంటికి వెళ్లాలన్నారు. కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవం వంటి ప్రధాన ఘట్టాలపై సమీక్షించారు. అనంతరం డీసీ విజయరామరాజు మాట్లాడుతూ ఉత్సవాలను ఉత్సాహంగా డ్యూటీ కోసం కాకుండా భక్తి సేవా దృక్పథంతో చేయాలని వివిధశాఖల అధికారులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం, దర్శనాలకు భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. రథోత్సవం సమయంలో పోలీసు బందోబస్తుతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు లేకుండా వాహనాలు అడ్డులేకుండా చూడాలన్నారు. చక్రస్నానం, తెప్పోత్సవాలపై ఫిషరీస్ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విద్యుత్ అంత రాయం లేకుండా చూడాలన్నారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ మాట్లాడుతూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్వామివారి కల్యాణోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ పారిశుధ్య చర్యలతోపాటు, వైద్య శిబిరాలు నిర్వహించి స్కౌట్ విద్యార్థులను స్వచ్ఛంద సేవాదళ్ ఏర్పాటుపై మాట్లాడారు. రూ.17కోట్లతో నిర్మితమవుతున్న స్థానిక పంచాయతీ చెరువులో ఈ సంవత్సరం తెప్పోత్సవం నిర్వహించడానికి వీలుండదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలపగా ఆర్డీవో కేశవర్ధనరెడ్డి స్పందిస్తూ అధికారులు, స్థానికులతో చివరి ఘట్టమైన తెప్పోత్సవాన్ని ఎలా నిర్వహించాలనేది తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలన్నారు. కొంతమంది వశిష్ఠ గోదావరిపై తెప్పోత్సవాన్ని నిర్వహిస్తే బాగుంటుందని సూచించగా సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ బస్సులు, రోడ్లు, వసతి గదులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహుదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ పాటి శివకుమార్, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఎంపీటీసీ భైరా నాగరాజు, చొప్పల బాబూరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఈవో బి.వెంకటేశ్వరరావు, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, తహసీల్దార్ రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరిశీలన..

అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఆలయ అధికారులతో కలిసి కళ్యాణ ప్రదేశం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలు జరిగే ప్రదేశాలను సందర్శించారు. చక్రస్నానం వద్ద భక్తుల సౌకర్యార్థం జల్లుస్నానం ఏర్పాటుచేయాలని భక్తులు కోరారు. దీనిపై సముద్రం వద్దకు ఆర్డీవో వెళ్లి పరిశీలించారు.

అన్ని ప్రాంతాలకు ఆదర్శంగా

యానాం ఉత్సవాలు

- అట్టహాసంగా ప్రారంభమైన యానాం ప్రజా ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రత్యేక అకర్షణగా నిలిచిన పూలతో అలకరించిన జగ్గు



ప్రజాఉత్సవాలను ప్రారంభిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, జనవరి 6: యానాం నియోజక వర్గంలో కొన్ని సంవత్సరా లుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యానాం ప్రజాఉత్సవాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పుదుచ్చేరి పర్యాటకశాఖా, యానాం ప్రజలస్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా రు. శనివారం సాయంత్రం స్థానిక పరిపాలనాధికారి మునిస్వామి అధ్య క్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరై ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించి అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 24సంవత్సరాలకు క్రితం యానాం ఫలపుష్ప ప్రదర్శన, 22 సంవత్సరాల క్రితం యానాం ప్రజాఉత్సవాలు ప్రారంభమయ్యాయని, అయితే మధ్యలో రెండుసంవత్సరాలు కరోనా ఇతర కారణాలతో వాయిదా పడటంతో ప్రస్తుతం 22వ ఫలపుష్ప ప్రదర్శన, 20న యానాం ప్రజాఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. యానాంలో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాకే పుదుచ్చేరి, కారైకాల్, మహేలో ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించిందన్నారు. యానాం ఉత్సవాల ప్రేరణతోనే కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం బీచ్ ఉత్సవాలు ప్రారంభించారన్నారు. సంక్రాంతి ముందుగానే ఈ ఉత్సవాలతో యానాంలో పండుగ వాతావారణం తీసుకురావాలనే ఉద్దేశంతో స్థానికంగా ఉన్న కళాకారులతోపాటు దేశ, విదేశాలకు చెందిన కళాకారులు ప్రదర్శనలను ఇస్తున్నారన్నారు. అనంతరం మల్లాడని ఆర్ఏ మునిస్వామి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రగాశం, ఎస్‌పి రఘునాయగం, వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరుకాలేదు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముందుగా ఈ ఉత్సవాలను పురస్కరించిన శాస్త్రీయ, సిని మా నృత్యపోటీలను నిర్వహించారు. ముఖ్యంగా విశాఖపట్నంకు చెందిన విక్టరీ ఈవెంట్‌మేకర్స్ అధినేత మేడిద విక్టర్ నేతృత్వంలో జబర్దస్త్ ఫేమ్ వినోదిని, రాజమౌళి యాంకరింగ్ అందరినీ ఉత్తేజపరిచింది. ఒడిస్సా సంబల్‌పూరి ఫోక్ డ్యాన్స్, పైకా నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం

యానాం, జనవరి 6: స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 21 సంవత్సరాలుగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 22వ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభమైయింది. క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ప్రజాఉత్సవాలకు హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరై ఈ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభించి అనంతరం తిలకించారు. ఈ ప్రదర్శన శనివారం నుంచి సోమవారం వరకూ మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫలపుష్పప్రదర్శనలో స్థానిక వ్యాపార సంస్థలకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాట్లు చేశారు.

సత్యదేవుడిని దర్శించిన మిజోరం గవర్నర్



మిజోరం గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న దేవస్థానం పీఆర్వో

అన్నవరం, జనవరి 6: సత్యదేవుడి తొలిపావంచా వద్ద శనివారం మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం పీఆర్వో వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పద్మ భూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతి రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులు ఉన్నారు.



ప్రమాదంలో కాలి బూడిదైన బోటు



మృతదేహంను వెలికితీసి అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

దరియాలతిప్పలో

బోట్లో అగ్నిప్రమాదం

బోటు యజమాని తమ్ముడు సజీవ దహనం

యానాం, జనవరి 6: యానాం శివారు దరియాలతిప్పలోని గోదావరి ఒడ్డున ఉన్న జెట్టిలో మత్స్యకారుల బోటులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకరు సజీవ దహనంకాగా మరొకరు గాయాల పాలయ్యారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన కామాడి నాగేశ్వరరావుకు చెందిన బోట్లో ఐస్, డీజిల్ తరలించే నేపథ్యంలో ఇంజన్ స్టార్ట్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బోటు యజమాని తమ్ముడు కామాడి గంగాద్రి(40) మంటలు ఆర్పేందుకు ప్రయత్నించి ప్రమాదంలో చిక్కుకొని సజీవ దహనమయ్యాడు. యానాం, ఆంధ్రప్రదేశ్, ఓఎన్జీసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసి మృతదేహాన్ని వెలికితీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యానాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బోటు విలువ సుమారు 40లక్షల వరకు నష్టం ఉంటుందని యానాం అగ్నిమాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు.

బోటు ప్రమాదంలో భైరవపాలెం వాసి..

ఐ.పోలవరం: యానాం దరియాలతిప్ప బోటు అగ్నిప్రమాదంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలేనికి చెందిన కామాడి గంగాద్రి సజీవదహనమయ్యాడు. దరియాలతిప్ప జెట్టీవద్ద బోటుకు మరమ్మతులు చేస్తుండగా మంటలు వ్యాపించడంతో ప్రమాదం జరిగింది. గంగాద్రికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని చనిపోవడంతో అనాథలమయ్యామంటూ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.



మృతుడు కామాడి గంగాద్రి

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు



ఏలేశ్వరంలో పీడీఎస్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ప్రత్తిపాడు, జనవరి 6: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి 40 బ్యాగుల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రెల్లివీధిలో పాత షాపింగ్‌కాంప్లెక్స్‌లో బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించిన సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు చేపట్టారు. 40 బ్యాగులలో సుమారు 2వేల కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. మన్యం రవితేజ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యం కిలో రూ.20లు వంతున రేషన్‌కార్డులవద్ద కొనుగోలుచేసి రూ.23లు చొప్పున ఇటుక కార్మికులకు విక్రయిస్తున్నాడు. ఈ బియ్యానికి సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో రూ.94వేలు గల బియ్యాన్ని, ఎలక్ట్రానిక్ తూకాన్ని సీజ్‌చేసి 6ఏ కింద కేసు నమోదు చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన మన్యం రవితేజపై క్రిమినల్ కేసులు నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ. సురేష్‌బాబు మాట్లాడుతూ తమ పరిధిలోని 3 జిల్లాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం కొనడం, అమ్మడం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుటామన్నారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగవెంకటరాజు సబ్‌ఇన్‌స్పెక్టర్ జగన్నాధరెడ్డి, ఏలేశ్వరం సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్, కానిస్టేబుల్ వల్లి, వీరబాబు పాల్గొన్నారు.

కారును ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి

- మహిళకు తీవ్ర గాయాలు
- కారుకు మోటార్ సైకిల్ హ్యాండిల్ తగలడంతో ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతా ఆదినారాయణ, సంఘటనాస్థలంలో ఉన్న కారు

గండేపల్లి, జనవరి 6: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో రామేశ్వరంపేట ఏడీబీ రోడ్డులో ప్రగతి కాలేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ జగన్నాధపురానికి చెందిన చింతా ఆదినారాయణ (29)మృతి చెందగా, మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం ప్రకారం... చింతా ఆదినారాయణ ఒక మహిళ మోటార్ సైకిల్‌పై పెద్దాపురంవైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా రామేశ్వరంపేట ప్రగతి కాలేజ్ దగ్గరికి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వైపు వస్తున్న కారుకు మోటార్ సైకిల్ హ్యాండిల్ తగలడంతో ముందు వస్తున్న మరో కారుపై పల్టీలు కొట్టి పక్కనే ఉన్న మరోకారుపై పడడంతో ఆదినారాయణ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా వెనుక ఉన్న మహిళకు తీవ్ర గాయాలు కావడంతో వారిని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. మహిళ పేరు తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచంలోనే తొలిసారిగా ఫార్మసీ విద్యార్థులకు వర్చువల్ ల్యాబ్ 3డీ



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంతు ఎం.పాటిల్

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే తొలిసారిగా బీ.ఫార్మసీ విద్యార్థుల కోసం 'వర్చువల్ ల్యాబ్ 3డీ'ని రూపొందించామని యూకే కేంద్రంగా పనిచేస్తున్న ఇన్ఫోప్లస్ టెక్నాలజీస్ డైరెక్టర్ జీవీహెచ్ ప్రసాద్ పేర్కొన్నారు. దివాన్‌చెరువు వీజేఎస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 'ఫార్మాస్యూటికల్ పరిశోధనల్లో ఇటీవల వృద్ధి, సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. వర్చువల్ ల్యాబ్ 3డీ ద్వారా ఫార్మసీలోని వివిధ అంశాలను, పాఠాలను ప్రదర్శించారు. తమ సంస్థ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల కోసం ఇప్పటికే 13 ఏళ్లుగా త్రీ డైమెన్షనల్ క్లాస్ రూం లెసన్స్‌ని ఆంధ్రా, తెలంగాణతోపాటు 16 రాష్ట్రాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు అందిస్తోందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంతు ఎం.పాటిల్ సత్కరించారు.

ఏజెన్సీ సమాచారం


అమ్మోరు అవతారమెత్తి నృత్యాలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అమ్మోరు అవతారమెత్తిన అంగన్‌వాడీలు

● 26వ రోజుకు చేరిన నిరసన

రాజవొమ్మంగి, జనవరి 6: మండల కేంద్రంలో శనివారం అంగన్‌వాడీల సమ్మె 26వ రోజుకు చేరింది. 26వ అంకె రూపంలో అంగన్వాడీ వర్కర్లు ఏర్పడి వినూత్న నిరసన చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె.వెంకటలక్ష్మి, చిన్ని కుమారీల ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్షలో శనివారం అంగన్వాడీ వర్కర్లు అమ్మోరు అవతారం ఎత్తి నృత్యాలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వీరే

చింతూరు, జనవరి 6: రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల పేర్లను ఆ పార్టీ పీసీసీ డెలిగేట్ ఎండీ హబీబ్ శనివారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన చింతూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎంపికను అరకు జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు సూచన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నియమించారు. ఎటపాక మండల అధ్యక్షుడిగా నక్క. వెంకన్న, కూనవరం శ్రీమంతుల వెంకటరమణ, వీఆర్ పురం ఎ.లీలా నాగేంద్రకృష్ణ ప్రసాద్, చింతూరు ఎండీ హబీబ్, మారేడుమిల్లి పుడికొడ హరికృష్ణ, రంపచోడవరం నక్కా బాలశివరామకృష్ణ, అడ్డతీగల దంగేటి సత్తిబాబు, రాజవొమ్మంగి షేక్ మహబూబ్ అలీ, గంగవరం మండల అధ్యక్షుడిగా నారవ దుర్గాప్రసాద్‌లను నియమించారన్నారు. ఈమేరకు వీరంతా పార్టీ కోసం కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అహ్మద్ అలీ, రవి, ఎండీ జవహర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి మండలాధ్యక్షుడిగా ఆలీ

రాజవొమ్మంగి, జనవరి 6:రాజవొమ్మంగి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా మహమ్మద్ ఆలీని నియమిస్తూ ఆ పార్టీ లేఖను విడుదల చేసింది. మండలంలో కాంగెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆలీ అన్నారు.

కాడెద్దుల బండి అమ్మొద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

వై.రామవరం, జనవరి 6: వ్యవసాయానికి ఉపయోగపడే కాడెద్దులు అమ్మేసి మోటార్ బైక్ కొనుక్కుంటానని కొడుకు తల్లిని అడగడంతో ఆమె నిరాకరించినందుకు మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వై.రామవరం మండలం ములసలపాలెంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ములసలపాలెం గ్రామంలో బచ్చెల బుల్లి అబ్బాయి రెడ్డి(25) తన ఇంట్లో ఉన్న రెండు ఎద్దులను అమ్ముకుని మోటార్‌బైక్ కొనుక్కుంటానని తల్లిని అడగటంతో ఎప్పటి నుంచి ఉంటున్న ఆ ఎద్దులు చనిపోయిన మీ నాన్నకు గుర్తుగా ఉంచాలని, అమ్ముకోవడానికి వీల్లేదని తల్లి చెప్పడంతో కొడుకు మనస్తాపం చెంది ఈనెల 2న గడ్డిమందు, లిక్కరు కలిపి తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని తొలుత అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అనుమానంతో భార్య హత్య

● గొంతుకోసి హతమార్చిన భర్త

వరరామచంద్రాపురం, జనవరి 6: భార్య వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో కట్టుకున్న భర్తే ఆమె గొంతుకోసి హత్యచేసిన సంఘటన మండలంలోని ములకలపల్లి పంచాయతీలోని వీరబాపనకుంట గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ డి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు సోయం రాధ(35) అదే గ్రామంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం లో కార్యకర్తగా పనిచేస్తోంది. ఈనేపథ్యంలో ఆమె భర్త సోయం చిరంజీవి తరచూ అనుమానిస్తూ వేధించేవాడని, ఈక్రమంలోనే శుక్రవారంరాత్రి మద్యం తాగి, భార్యతో గొడవ పెట్టుకొని హత్యకు పాల్పడ్డాడని, మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

గురుమంద గుడికి మాజీ ఎంపీ కొత్తపల్లి విరాళం


మాజీ ఎంపీ కొత్తపల్లి గీత కమిటీ సభ్యులకు రూ.3లక్షలు అందజేస్తున్న దృశ్యం

వై.రామవరం, జనవరి 6: అల్లూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన వై.రామవరం మండలం అటవీప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా వెలిసిన గురుమంద విశ్వనాథ స్వామి ఆలయాభివృద్ధికి అరకు పార్లమెంట్ మాజీ ఎంపీ కొత్తపల్లి గీత రూ.3లక్షలు విరాళంగా ఇచ్చారు. గత నెలలో ఆమె గురుమంద విశ్వనాథ స్వామిని దర్శించుకునేందుకు విచ్చేసిన ఆమె రూ.3లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ప్రకటించారు. అనుకున్న మాట ప్రకారం శనివారం ఆమె వై.రామవరం వచ్చి గుడి కమిటీ సభ్యులు పల్లాల వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, ఆదివాసీ సంఘ జిల్లా అధ్యక్షుడు వెదుర్ల లచ్చిరెడ్డిల సమక్షంలో ఆమె రూ.3లక్షల నగదును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీకి పుష్పగుచ్ఛంతో వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పల్లాల విశ్వారెడ్డి, పండురెడ్డి, కృష్ణారెడ్డి, నడిగుంట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మారేడుమిల్లి -చింతూరు ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం


రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ

మోతుగూడెం, జనవరి 6: మారేడుమిల్లి -చింతూరు ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మారేడుమిల్లి మండలం వాలమూరు సమీపంలోని వాలిసుగ్రీవ బొమ్మల మలుపు వద్ద ఒక లారీ సాంకేతిక లోపంతో రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా భారీ వాహనాలు వెళ్లే దారి లేకపోవడంతోవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజమహేంద్రవరం వైపు నుంచి చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి భారీ లోడుతో వెళ్తున్న లారీ శనివారం రాత్రి మారేడుమిల్లి- చింతూరు ఘాట్‌రోడ్డులో వాలమూరు సమీపంలో ప్రమాదకర మలుపులో నిలిచిపోయింది. దీంతో మిగిలిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే నిలిచిన లారీ పక్క నుంచి కొంత ఖాళీ ఉండడటంతో ద్విచక్రవాహనదారులు, చిన్నకార్లు,జీపులు వంటి వాహనాలు వెళ్ళే ఆస్కారం ఉండటంతో అవి వెళుతున్నాయి. భారీ వాహనాలు, బస్సులు మాత్రం వెళ్ళడానికి ఆస్కారం లేకుండా పోయింది. ఫలితంగా ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అసలే ఇది అంతరాష్ట్ర రహదారి కావడంతో జిల్లాలోని విలీన మండలాలతో పాటు, తెలంగాణా, చత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ , మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. దీంతో రాత్రింబవళ్లు భారీ వాహనాలు తిరుగుతూనే ఉంటున్నాయి. ఈ క్రమంలో భారీ లారీ నిలిచిపోవడంతో ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిన లారీని తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు టీడీపీ సాయం

కూనవరం, జనవరి 6: కూనవరం మండలం అయ్యవారిగూడెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై ఇల్లు దగ్ధమైన కుటుంబాన్ని శనివారం రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి వంతల రాజేశ్వరి పరామర్శించారు. టీడీపీ ఆధ్వర్యంలో ఆమె దుప్పట్లు, బట్టలు రూ. 5వేల నగదు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో అరకుపార్లమెంటు అధికారప్రతినిధి యడవెల్లి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు, షేక్‌రసూల్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

నేడు చెకుముకి జిల్లాస్థాయి పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6: జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు ఈనెల 7న రాజమహేంద్రవరం శ్రీరామ్‌నగర్‌లోని గౌతమి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జరుగుతాయని అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, కార్యదర్శి వై.పైడియ్య తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల టీములు పాల్గొనాలని తెలిపారు. ఇక్కడ విజయం సాధించిన విద్యార్థులు ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధిస్తారని పేర్కొన్నారు.

సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు

రాజమహేంద్రవరంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్, భవాని చారిటబుల్ ట్రస్ట్, సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు శనివారం జరిగాయి. పోటీలకు విచ్చేసిన అతిథులకు స్వాగతం పలుకుతున్న, విజేతలైన వారికి కన్సోలేషన్ బహుమతులు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, సిబ్బంది. -రాజమహేంద్రవరం సిటీ





బీసీలకు రాజ్యాధికారం కల్పించింది టీడీపీయే


అనపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

» బీసీలను చైతన్యపరిచేందుకు జయహో బీసీ
» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి జనవరి 6: ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన నాటి నుంచి బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ బీసీలను అన్నివిధాల మోసగించిందని కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధుల మాట ఎలా ఉన్నా కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. ప్రస్తుతం హాస్టళ్లలో చదువుకుంటున్న బీసీల పరిస్థితి దారుణంగా మారిందని, చేతి వృత్తుల వారికి నాడు ప్రవేశపెట్టిన ఆదరణ పథకాన్ని వైసీపీ అటకెక్కించిందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 34శాతం ఉన్న రిజర్వేషన్లను 24శాతానికి తగ్గించిన ఘనత జగన్‌దేనన్నారు. బీసీలకు ఏం న్యాయం చేశారని సాధికార యాత్రలు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. నాడు పంచాయతీలు దేశానికి పట్టుకొమ్మలుగా ఉంటే నేడు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి చేరుకున్నాయన్నారు. ఆర్థిక సంఘం నిధులను పక్కదోవ పట్టించి పంచాయతీలను నిర్వీర్యం చేశారని టీడీపీ అధికారంలోకి రాగానే పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బీసీ వర్గాలకు జరిగిన అన్యాయంపైనా బీసీలను చైతన్య పరిచేందుకు జయహో బీసీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, జుత్తుగ కృష్ణ, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు, గొలుగూరి భాస్కరరెడ్డి, త్రిమూర్తులు, ఈసీబు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన ఉండాలి

» డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టం-2019పై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. వినియోగదారుల చట్టాలు, ఫిర్యాదు చేసే విధానం, పరిష్కార మార్గాలపై డీఎల్ఎస్ఏలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసినా, సేవలు పొందినా కచ్చితంగా రశీదు తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. అప్పుడే పరిమాణం, కల్తీ, నాణ్యత లేకపోవడం వంటి వాటిపై నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారులు స్వయంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల కేసులు, పరిష్కారాలను ఆమె వివరించారు. వినియోగదారులు తమ సమస్యలపై లేదా మరింత సమాచారం కోసం 1915 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. న్యాయపరమైన సమస్యలు, సందేహాల నివృత్తికి డీఎల్ఎస్ఏని సంప్రదించాలని ప్రత్యూషకుమారి చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

'చలో ఆచంట'కు తరలిరండి: బీవీఆర్ చౌదరి

కోరుకొండ, జనవరి 6: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ఆచంటలో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించనున్న బహిరంగ సభకు తరలిరావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఆచంటలో బహిరంగ సభ ఏర్పాట్లను అక్కడి నాయకులతో కలిసి పరిశీలించినట్టు తెలిపారు. నర్సాపురంలో జరిగే విస్తృత స్థాయి సమావేశంలో తాను పాల్గొననున్నారన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు తరలివచ్చి ఆచంటలో చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి రైతు సంఘం రాష్ట్ర మహాసభలు


ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 8, 9, 10 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరుగుతాయని మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. ఈమేరకు శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం పదిగంటలకు మున్సిపల్ స్టేడియం నుంచి రైతు ప్రదర్శన ప్రారంభమవుతుందని, 11 గంటలకు రివర్‌బే ఆహ్వానం హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. 26 జిల్లాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు ఈ సభలకు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కర్షక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కూండ్రపు రాంబాబు, వి.కొండలరావు, పి.నాగేశ్వరరావు, కె.జ్యోతిరాజు పాల్గొన్నారు.

'జీయోన్' విద్యార్థులకు గోరంట్ల పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: రాజమహేంద్రవరంలో ఇటీవల తొలగించిన జీయోన్ అంధుల పాఠశాల ఘటన వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం బాధిత విద్యార్థులను పరామర్శించారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేట గరల్స్ హైస్కూల్లో ఆశ్రయం పొందిన దివ్యాంగులను కలిసి, వారికి టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాస్‌రెడ్డి సమకూర్చిన రైస్‌కుక్కర్లు, పండ్లను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిన్నింటి ఏకబాబు, ఆళ్ల ఆనందరావు, యర్రమోతు ధర్మరాజు, మజ్జి పద్మ, శీలం గోవింద్, బూరా దుర్గాంజనేయరావు, పిల్ల తనుజ, బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సంస్థ రజతోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: స్వర్ణాంధ్ర సంస్థ రజతోత్సవం శనివారం లాలాచెరువు ఆశ్రమంలో ఘనంగా జరిగింది. దీనికి ఎంపీ భరత్‌రామ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాంబాబు తన జీవితాన్నే సేవకు అంకితం చేశారని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం 12 కుట్టుమిషన్లు, 200 మందికి రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పూలే చైతన్యవేదిక వ్యవస్థాపకుడు నయనాల కృష్ణారావు, గుత్తుల మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షితలు పంపిణీ

కడియం, జనవరి 6: మండలం కడియపులంక, బుర్రిలంక గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామచంద్రుని అక్షితల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. మేళతాళాలు, డోలుసన్నాయి వాయిద్యాల నడుమ ప్రతి ఇంటి వెళ్లి అక్షితలను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు, నర్సరీరైతులు పాల్గొన్నారు.

జనార్దనస్వామిని దర్శించుకున్న మంత్రి వేణు

ధవళేశ్వరం, జనవరి 6: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ పౌర సంబంధాల శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శనివారం ధవళేశ్వరంలో లక్ష్మీజనార్దనస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. రూరల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన అనంతరం మొదటిసారిగా ఆలయానికి విచ్చేసిన మంత్రి వేణుకు అర్చకులు ఎస్వీఎస్ఎన్ ఆచార్యులు, ఆలయాధికారి నాగసురేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్థానిక జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

సత్యనారాయణకు డాక్టరేట్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6: రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న వీవీవీ సత్యనారాయణ డాక్టరేట్ సాధించారు. జాతీయ విద్యుత్ ఉత్పాదన సంస్థ రామగుండం-దాని ఉద్యోగుల, లబ్ధిదారుల దృక్కోణాల సూచనలతో కార్పొరేట్ సామాజిక బాధ్యత, చొరవ అనే అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కిశోర్‌బాబు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని ఆయన సమర్పించారు. ఈ పరిశోధనలలో భాగంగా వివిధ జర్నల్స్‌లో నాలుగు పరిశోధనా వ్యాసాలను ఆయన ప్రచురించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైల శాస్త్రి, అధ్యాపకులు ఎ.అన్నపూర్ణ, పి.షణ్ముఖరావు, బి.ప్రతిమ, దీక్షిత, ఇతర అధ్యాపకులు.. సత్యనారాయణను అభినందించారు.

ప్రతిరోజు ఆధ్యాత్మిక గ్రంథం పఠించాలి

ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు



అనపర్తి, జనవరి 6: ప్రతి ఒక్కరూ పడుతునే ముందు ఆధ్యాత్మిక గ్రంథాన్ని గంటపాటు చదివితే జీవితంలో మంచి మార్పు వస్తుందని ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు అన్నారు. అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీశారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్స వాల్లో భాగంగా శనివారం రాత్రి జ్ఞానమూర్తి భీష్మపితామహుడు అనే అంశంపై గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ద్వాపర యుగంలో ఎక్కువ యజ్ఞ యాగాదులు నిర్వహించింది భీష్ముడని, ఓం నమశ్శివాయ అనే మంత్రం ప్రతి నిత్యం జపించే వారి దరికి ఎటువంటి కష్టనష్టాలు చేరవన్నారు. మహాభారతంలో భీష్ముడి వివరించారు. ఈ సందర్భంగా గరికపాటిని పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, సత్తి రామారెడ్డి మాలతి దంపతులు, మారెళ్ళ గంగరాజు శర్మ, మేడపాటి చెల్లారెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, సంగీత కళా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ నిత్యాన్నదానం ప్రారంభం

కోరుకొండ, జనవరి 6: డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కోరుకొండ బస్టాండ్ వద్ద జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన మహిళా సాధికార సమితి కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శనివారం ప్రారంభించారు. అలాగే సీతానగరంలో జనసేన యువజన నాయకుడు తోట పవన్‌కుమార్, రాజానగరంలో వీరమహిళ సాధికార కమిటీ కోఆర్డినేటర్ తోట ప్రత్యూషదేవి ప్రారంభించారని బలరామకృష్ణ తెలిపారు. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టాలనే సదుద్దేశ్యంతో డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా కోరుకొండ అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలో అధిక సంఖ్యలో భోజనాలు తిన్నారు. కార్యక్రమంలో బదిరెడ్డి దొర, బదిరెడ్డి తులసి, దేవన దుర్గప్రసాద్, యర్రంశెట్టి పోలారావు పాల్గొన్నారు. అలాగే జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షయ అమృత నిత్యాన్నదాన కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం కోరుకొండ బస్టాండ్ వద్ద వైసీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ప్రారంభించారు. రాజానగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సీతానగరంలో జక్కంపూడి విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.

సీతానగరం: డొక్కా సీతమ్మ, పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో నిత్యాన్నదాన కార్యక్రమం చినకొండేపూడిలోని బాలాజీ సెంటర్ వద్ద తోట పవన్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో తోట ప్రత్యూష, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు. అలాగే జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు.

అంగన్వాడీలపై ఎస్మా రాజ్యాంగ విరుద్ధం

ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు ముప్పాళ్ల

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని.. నిరంకుశ పాలనకు తార్కాణమని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమం కార్మికులు ఉద్యమం చేస్తుంటే.. నియంతృత్వ పోకడలతో భయానక వాతావరణాన్ని సృష్టించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందనడానికి ఎస్మా ప్రయోగమే నిదర్శనమన్నారు. ఈ చర్యలను ఖండిస్తున్నామన్నారు. పలుమార్లు చర్చలు జరిగినా జగన్ హామీలను నేరవేర్చడనాకి ప్రభుత్వ నిరాకరించిందన్నారు. అంగన్వాడీలే కాకుండా న్యాయవాదులు, పారిశుధ్య కార్మికులు, సర్వశిక్షా ఉద్యోగులు, వీఆర్ఏ తదితర సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేయడం ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను అనుసరించి సీఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ధవళేశ్వరంలో నృత్యప్రదర్శన

ధవళేశ్వరం, జవవరి 6: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ఆలయ నృత్యాన్ని ప్రదర్శించింది. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సకల దేవతా హారతి, పుష్పాంజలి సమర్పించారు. అనంతరం అన్నమాచార్య కీర్తనలకు నృత్యం చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను సత్కరించి, కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగ సురేష్, సాధనాల చంద్రశేఖర్, యర్రమోతు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ల పంపిణీ

రంగంపేట, జనవరి 6: సీఎం జగన్ ఎన్నికల హామీ ప్రకారం దఫదఫాలుగా పింఛను రూ.3 వేలుకు పెంచారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లమిల్లి, సింగపల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, కోటపాడు గ్రామాల్లో వైఎస్సార్ పింఛను పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో 65 ఏళ్లు నిండితేనే గాని పింఛను వచ్చేది కాదని ఇప్పుడు 60 ఏళ్లకే పింఛను వస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అడబాల వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు


బలభద్రపురంలో గరుడ వాహనంపై వున్న దేవేరులతో ఊరేగుతున్న వెంకటేశ్వరస్వామి

బిక్కవోలు, జనవరి 6: బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. రెండో రోజు కార్యక్రమాల్లో ఉదయం స్వామి అమ్మవార్లకు వసంతోత్సవం, విశేషోత్సవం, జలకుంకుమోత్సవం, వేంకటేశ్వర వ్రతం, సాయంత్రం గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామి వారి వాహనం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం ప్రత్యేక ఉత్సవం, వారోత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోడానికి వచ్చిన భక్తులు అన్నదానంలో పాల్గొన్నారని ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

సారా కేసులో మహిళ అరెస్టు

రంగంపేట, జనవరి 6: సారా కేసులో మహిళను అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి శనివారం తెలిపారు. మండలంలోని పెద్దకొడ్డిగుంట గ్రామానికి చెందిన చెల్లుబోయిన సూర్యనాగమణి వద్ద 16 లీటర్ల సారా ఉండడంతో ఆమెను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	:	డెవిల్
సూర్యామినీ	:	ఆక్వామేన్
సూర్యాప్యాలస్	:	యానిమల్
స్వామి	:	హాయ్ నాన్న
శివజ్యోతి	:	మాయాబజార్
అనుశ్రీ(సాయికృష్ణ)	:	డెవిల్
రాజా	:	సలార్
అశోక	:	సలార్
ఊర్వశి	:	డెవిల్
రంభ	:	బబుల్‌గమ్
మేనక	:	ఆక్వామేన్
అప్సర	:	కపాలదీవి
వీఎస్ మహల్ (నామవరం)	:	సలార్, డెవిల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	:	డెవిల్
వెంకటసూర్య(కడియం)	:	సలార్,డెవిల్
సత్యగౌరి (అనపర్తి)	:	సలార్
సూర్యశ్రీ (అనపర్తి)	:	డెవిల్
ఫార్చ్యున్ సినిమాస్(రాజానగరం)	:	డెవిల్
రామకృష్ణ(కోరుకొండ)	:	డెవిల్
గీతాసినిమాస్ (సీతానగరం)	:	హాయ్ నాన్న
శ్రీనివాస (గోకవరం)	:	డెవిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	:	సలార్
లలితామహల్(రంపచోడవరం)	:	డెవిల్
నవయుగ(చింతూరు)	:	డెవిల్







రాజమహేంద్రవరంలోని షిరిడిసాయి జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ముగ్గుల పోటీ దృశ్యం

భువిపై హరివిల్లు!

రాజమహేంద్రవరంలో..

- ఆకట్టుకున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ
- షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ముందే వచ్చిన సంక్రాంతి
- మంచి సంప్రదాయాన్ని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కొనసాగిస్తోందన్న వక్తలు
- వారి స్ఫూర్తితోనే రాజమహేంద్రవరంలో పోటీలు నిర్వహిస్తున్నాం..
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల సభలో ఆదిరెడ్డి శ్రీనివాస్
- విజేతలకు నగదు, కన్సొలేషన్ బహుమతులు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: ప్రతి ఏటా మహిళలను ప్రోత్సహిస్తూ ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ద్వారా మంచి సంప్రదాయాన్ని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కొనసాగించడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు సమీపంలోని షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" శనివారం వైభవంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఆదిరెడ్డి భవాని చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరించింది. ఈ పోటీలను షిరిడిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ప్రారంభించగా ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, అలయన్ క్లబ్ ప్రతినిధి, తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యన కుమారిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ అధ్యక్షతన వహించగా భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ఈ ఏడాది రాజమహేంద్రవరంలో 40 డివిజన్లకుపైగా సుమారు రూ.8 లక్షల వ్యయంతో మహిళలను ప్రోత్సహిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడానికి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలే స్ఫూర్తి అని అన్నారు. ఆదిరెడ్డి వీరాఘవమ్మ మాట్లాడుతూ తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రతిరోజూ ఇంటి వాకిలి శుభ్రం చేసుకుని ముగ్గులు పెట్టుకునే సందర్భాలను గుర్తుచేశారు. మంచి సంప్రదాయాలను గుర్తుచేస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని అభినందించారు. షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టీ శ్రీవిద్య మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి టీమ్ ఎంతో శ్రద్ధతో ఈ ముత్యాల ముగ్గుల పోటీలను విజయవంతంగా నిర్వహించారన్నారు. తమ విద్యాసంస్థల ప్రాంగణంలో సంక్రాంతి పండుగను వారం ముందుగానే తీసుకు వచ్చారని చెప్పారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో సుసంపన్నమైన సంస్కృతి సంప్రదాయాలను ఆంధ్రజ్యోతి ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఏటా ఈ ముగ్గుల పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వస్తున్నామని ఆయన చెప్పారు. ముగ్గుల పోటీల న్యాయనిర్ణేత మాటూరి మంగతాయారు మాట్లాడుతూ మహిళలను ముగ్గుల పోటీల ద్వారా ఉత్సాహపరుస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని అభినందించారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రథమ బహుమతి విజేత రాజమహేంద్రవరానికి చెందిన డి నాగజ్యోతికి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి విజేత ధవళేశ్వరానికి చెందిన కె.లక్ష్మికి రూ.4 వేలు, మూడో బహుమతి విజేత టి.ఆదిశ్రీకి రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. అలాగే కన్సొలేషన్ బహుమతులు మరో 12 మంది మహిళలకు అందజేయగా, పాల్గొన్న అందరికీ గిఫ్టులను అందించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి జిల్లా ఇన్‌చార్జి ఎస్ఎస్ఎస్ సత్యనారాయణ, ఏబీఎన్ జిల్లా ఇన్‌చార్జి కె రాజబాబు, సర్క్యులేషన్ జిల్లా మేనేజరు గోపాలకృష్ణ, యాడ్స్ జిల్లా మేనేజర్ కృష్ణారావు, సబ్ ఎడిటర్ కిరణ్, ఆంధ్రజ్యోతి పాత్రికేయులు ఎంబీవీ సారథి, రామచంద్రరావు, కె శ్రీకాంత్, బెజవాడ శంకర్, ఏబీఎన్ కెమెరామన్ ఎం సతీష్, ఫొటోగ్రాఫర్ రాంబాబు, త్రీజీ కిట్ చందు, యాడ్స్ సిబ్బంది బి సుబ్రహ్మణ్యం, రవీంద్ర, కిరణ్‌కుమార్, విజయేంద్రనాథ్, సర్క్యులేషన్ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బాషా, ఎస్ఆర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో నాకు ప్రథమ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి యేడాది ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. మహిళలకు సంప్రదాయాల పట్ల మక్కువను పెంచుతోంది. ఈ ఏడాది పోటీల్లో నేను ప్రథమ బహుమతి సాధించడం పండుగ గిఫ్ట్‌గా భావిస్తున్నాను. ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు.

- డి. నాగజ్యోతి, రాజమహేంద్రవరం
ప్రథమ బహుమతి విజేత

బహుమతి రావడం సంతృప్తినిచ్చింది

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రతి యేడాది పాల్గొంటున్నాను. ఈ ఏడాది పోటీల్లో ద్వితీయ స్థానం రావడం సంతృప్తినిచ్చింది. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రయార్టీ ప్రకారం ఆఖరిగా అలంకరణను పరిగణంలోకి తీసుకోవడం బాగుంది. క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం పోటీలు నిర్వహించడం బాగుంది.

- కె. లక్ష్మి, ధవళేశ్వరం
ద్వితీయ బహుమతి విజేత



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు

నేడు చంద్రబాబు విమానాశ్రయానికి రాక

రాజమహేంద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఆదివారం రాత్రి మధురపూడి విమానాశ్రయానికి రానున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని, సాయంకాలం 6.30 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గాన రాత్రి 8 గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత 8.10 విమానంలో బయలుదేరి వెళతారు.













రాజమహేంద్రవరంలో జరిగిన ముగ్గుల పోటీలో మొదటి బహుమతి కింద రూ.6 వేల నగదును విజేత డి నాగజ్యోతికి అందజేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్.. (కింద) మొదటి బహుమతి పొందిన ముగ్గు

ద్వితీయ బహుమతిగా రూ.4 వేల నగదును విజేత కె.లక్ష్మికి అందజేస్తున్న ఆదిరెడ్డి వీరరాఘవమ్మ.. పక్కన తృతీయ బహుమతిగా రూ.3 వేల నగదును విజేత టి.ఆదిశ్రీకి అందజేస్తున్న షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ... (కింద) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గులు



అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

ఎంపీ భరత్‌రామ్‌పై చర్యలు తీసుకోండి!

అడిషనల్ ఎస్పీకి టీడీపీ, జనసేన నేతల ఫిర్యాదు

ఆదిరెడ్డి కుటుంబంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలకు వినతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న ఆదిరెడ్డి కుటుంబంపై ఎంపీ భరత్‌రామ్ అనుచరులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసత్యాలు ప్రచారం చేస్తూ వారి పరువుకు భంగం కలిగించేవిధంగా ఉన్నందున వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్ సెల్, జనసేన నేతలు రాజమహేంద్రవరంలో జిల్లా అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన అర్బన్ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై శ్రీను, సీపీఎం, సీపీఐ, ఆర్‌పీసీ పార్టీల నాయకులు జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వెళ్లారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ ఎస్పీకి తమ ఫిర్యాదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిలను కించపరుస్తున్నారని, దానికి సంబంధించిన పేపరు క్లిప్పింగ్‌లను వారి ఫిర్యాదుతో అందజేశారు. 2019లో అసెంబ్లీలో నూతన మద్యం పాలసీపై చర్చ జరుగుతుండగా ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిపై అవహేళనగా మాట్లాడారని, దీనిపై గౌరవ స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. అనంతరం రాజమహేంద్రవరంలో దిశ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఆదేవిధంగా ఎంపీ భరత్‌రామ్ పలు మీడియా సమావేశాల్లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను బ్లేడ్ బ్యాచ్‌లను పెంచిపోషిస్తున్నారని వైసీపీ నాయకులు కొంతమంది వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా బ్లేడ్ బ్యాచ్‌లను మెయింటైన్ చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేశారని, అలాగే మరికొందరు సోషల్ మీడియాలో అసభ్యకరమైన పదజాలంతో అవాస్తవ సంఘటనలతో ట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల డ్రగ్ కేసులో దొరికిన ద్వారపూడి విక్రమ్‌రెడ్డి.. ఎంపీ భరత్‌రామ్ ముఖ్య అనుచరుడని వారు ఆరోపించారు. అనేక సందర్భాల్లో వారు కలిసి తిరిగారని, వారిద్దరు చాలా సన్నిహితంగా ఉంటారని అంటున్నారని చెప్పారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పిట్టా ప్రసన్నకుమార్, చిల్లా శ్రీను, పట్నాల శ్రీను, ఎస్ఎస్‌వీపీ ప్రసాద్, డీవీకేఎంఎస్ ప్రసాద్, రాంబాబు, కె కనక లింగేశ్వరరావులు ఏఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలి





సభల్లో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు సత్కారం.. మాట్లాడుతున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

- మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు
- కన్నుల పండువగా 2వ రోజు అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/రాజానగరం/దివాన్‌చెరువు,జనవరి6: తెలుగు భాషా వికాసానికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు స్పష్టం చేశారు. తెలుగు భాషను బతికించుకోవడం, వ్యాప్తి చేయడాన్ని అందరూ బాధ్యతగా స్వీకరించి తెలుగుభాషా వికాసానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కన్నుల పండువగా కొనసాగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ఈ మహాసభలు జరగడం తెలుగువారికి గర్వకారణం. తెలుగు బలహీన పడుతుందనే భయాందోళనల మధ్య ఇలాంటి తెలుగు మహాసభలను నిర్వహించి తెలుగు భాష పట్ల మమకారాన్ని, అభిమానాన్ని పెంచుతూ భాషా వ్యాప్తికి కృషి చేస్తున్న మహనీయులకు అభినందనలు' అని ఆయన పేర్కొన్నారు. తెలుగులో అనేక రకాల కవితలు, కథలు రాయడం దగ్గరనుంచి గేయాలు, జానపద గేయాలు, హరికథలు, బుర్రకథలు ఇంకా అనేక రకాల ప్రక్రియలు ఉన్నాయన్నారు. వాటిలో గజల్స్‌ని గజల్ శ్రీనివాస్ ప్రజల దగ్గరకు తీసుకొచ్చారని చెప్పారు. త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు కీర్తనలు.. శ్రీనాథుడు, పోతన వంటి మహాకవులు తెలుగు వెలుగుకు చేసిన విశేష కృషి మహాసభల సందర్భంగా గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒకనాడు రాజమహేంద్రవరం అంటే తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి రాజధాని అనే పేరు ఉందని హరిబాబు కొనియాడారు. గోదావరి తీర ప్రాంతంలో అల్లూరి, డొక్కా సీతమ్మ, కందుకూరు వీరేశలింగం పంతులు, మధునాపంతులు, శ్రీపాద, బోయి భీమన్న వంటివారు ఎందరో చిరస్మరణీయులన్నారు. 'శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకూ ఎన్నో నదులున్నాయి. ఇంతటి నీటి సంపద ఉన్న ప్రాంతం తెలుగు వారి ప్రాంతం మాత్రమే. ఇన్ని నదుల్లో గోదావరి నది మహానది. ఆ నది జలాల ద్వారా తెలుగు వారి ఆర్థిక పరిపుష్టికి పునాది వేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్' అని ఆయన కొనియాడారు. 2024వ సంవత్సరం తెలుగు ప్రజలకు మంచి ఉన్నతిని ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారి రచనలను హిందీలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని.. తద్వారా అన్ని భాషల్లోకి వెళ్లి మన భాష గొప్పదనం ప్రపంచానికి తెలుస్తుందన్నారు. తెలుగు వారికే సొంతమైన అవధాన ప్రక్రియను హిందీలోకి తీసుకెళ్లి ఉత్తర భారతదేశంలో హిందీలో అవధాన ప్రక్రియ చేసిన వారు రాజమండ్రి వాసి చేబోలు శేషగిరిరావు అని ఆయన గుర్తుచేశారు. ఆయన విగ్రహం ఏర్పాటుచేయాల్సి ఉందని పేర్కొన్నారు.



అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా గైట్ కాలేజీల్లో శనివారం సాయంత్రం తెలుగు తోరణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

తెలుగుజాతి విలువ పెంపునకు పునరంకితం కావాలి : జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 6: తెలుగు జాతి విలువలను మరింత పెంచేందుకు మనమంతా పునరంకితం కావాలని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. తెలుగు మహాసభల్లో శనివారం రాత్రి తెలుగు తోరణం నృత్యరూపక ప్రదర్శన కన్నుపండువగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుజాతి వైభవాన్ని, విలువలను కళావైభవాన్ని ఒక్క ప్రదర్శనలో చూపారని కొనియాడారు. ప్రస్తుత తరానికి మన జాతి నాయకులు విలువలు, విశిష్టత తెలుసుకోవడానికి చక్కటి అవకాశం దొరికిందన్నారు. ఈ ప్రదర్శన తిలకించినంతసేపు భావోద్వేగానికి లోనయ్యానని చెప్పారు.సినీనటుడు గౌతంరాజు మాట్లాడుతూ ఈ గడ్డ మీద పుట్టడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఈ నృత్య ప్రదర్శన ద్వారా మన తెలుగుజాతి గౌరవాన్ని ఎక్కడికో తీసుకెళ్లారని చెప్పారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, పీఎస్‌బీ హైదరాబాదు జోనల్ మేనేజర్ డీకే శ్రీవాత్సవ్ తదితరులు మాట్లాడారు.

విశిష్ట సేవాపురస్కారాల ప్రదానం

తెలుగు మహాసభల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. చలనచిత్ర రంగంలో సినీనటుడు గౌతమ్‌రాజుకు, పాత్రికేయ రంగంలో వీఎస్ఎస్ కృష్ణకుమార్‌కు, సేవారంగంలో డాక్టర్ మొల్లేటి రామ్మోహన్‌కు, సంగీతంలో పెద్దేహపు సాయిబాబా, తెలుగుభాషా సేవలో ఎస్ఆర్ఎస్ కొల్లూరి, సాహిత్యంలో కేటీ పద్మజకు విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెక్షన్ 106ను రద్దు చేయాలి

దుద్దుకూరులో లారీడ్రైవర్ల రాస్తారోకో, నిరసన



దుద్దుకూరులో ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

దేవరపల్లి, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్‌అండ్‌రన్ సెక్షన్ 106 రద్దు చేయాలని క్వారీ డ్రైవర్ల యూనియన్ నాయకుడు మస్తాన్ ఆకాష్ డిమాండ్ చేశారు. మండలంలోని దుద్దుకూరులో లారీడ్రైవర్లు శనివారం రాస్తారోకో, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ఈ చట్టం మేరకు ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పారిపోతే పదేళ్ల వరకు జైలు, రూ.7లక్షల వరకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని, దీని వల్ల లారీ డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతారని, డ్రైవర్ కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల లారీ మర్చంట్ యూనియన్ సభ్యుడు సత్యనారాయణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

దేవరపల్లి, జనవరి 6: సంక్రాంతి పండుగ పేరుతో మండలంలో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ రామకృష్ణ, ట్రైనీ డీఎస్పీ భానోదయ హెచ్చరించారు. దేవరపల్లిలోని తహశీల్దార్ కార్యాలయంలో కోడిపందేల నియంత్రణపై రెవెన్యూ అధికారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, కోడిపందేలు, జూదం, గుండాట నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, రెవెన్యూ అధికారులు, పోలీసులు, నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సాంప్రదాయ క్రీడలు ఆడేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలకు కిట్లు పంపిణీ

తాళ్లపూడి, జనవరి 6: తాళ్లపూడిలో పంచాయతీ వద్ద ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ముగింపు సందర్భంగా విజేతలకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పన జగదీష్, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, నక్కా చిట్టిబాబు, పోసిబాబు, కార్యదర్శి ఆశాఅలేఖ్య పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో పింఛన్ల పంపిణీ



వేగేశ్వరపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి వనిత

చాగల్లు/తాళ్లపూడి, జనవరి 6: మండల కేంద్రం చాగల్లు, తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం శివారు దాసరి దానయ్య ఎస్టేట్‌లో శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాలకు హోం మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా విచ్చేసి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. వేగేశ్వరపురంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ తదితరులు పాల్గొనగా చాగల్లులో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మచైర్మన్ గంగ్రోతు సురేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9న కిక్ బాక్సింగ్ జట్ల ఎంపిక

నిడదవోలు, జనవరి 6: నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న తూర్పు గోదావరి జిల్లా కళాశాలల, విశ్వ విద్యాలయాల స్థాయిలో స్త్రీపురుషుల కిక్ బాక్సింగ్ జట్ల ఎంపిక జరుగుతుందని ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. మరిన్ని వివరాలకు ఎస్.ప్రసాదరావు 73825 23736 నెంబరులో సంప్రదించాలన్నారు.

సచివాలయ వ్యవస్థతో సత్ఫలితాలు

నల్లజర్ల, జనవరి 6: సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలో సత్ఫలితాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కొనియాడారు. జగన్నాథపురంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో సచివాలయ వ్యవస్థ వేగంగా పని చేసోందన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లారి శ్రీను, తహశీల్దార్ కిషోర్‌కుమార్, ఎంపీటీసీలు కాకర్ల రాజారావు, వామిశెట్టి పావనీకుమారి, బుంగ సుబ్బారావు, బంకా అప్పారావు, కారుమంచి రమేష్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

నల్లజర్ల, జనవరి 6: అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలు మండలంలోని చీపురుగూడెంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాలయం, వినాయక ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. ముందుగా జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, ఎంపీటీసీ రావూరి వెంకటరమణకు అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ తలంశెట్టి మాధవరావు, చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు హరిబాబు, కూసంపూడి వెంకటేశ్వరరావు, బీజేపీ మండలాధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, తలంశెట్టి కోటేశ్వరరావు, సాయి, వల్లెపల్లి వీర్రాజు, మద్దిపాటి ఝాన్సీ పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో సమరసత సేవ ఫౌండేషన్ మండల కన్వీనర్ బొల్లిన సత్యవతి, భజన సమాజం ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. రామాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని అన్ని ఆలయాల్లోనూ పంపిణీ చేశారు.

పెరవలి: మండలంలోని తీపర్రులో జరిగిన అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమంలో మహిళలు, రామభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయిబాబా, హనుమంతుడి వేషధారులు సందడి చేశారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం, జనవరి 6: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. శనివారం వడ్లూరులో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ, సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, నాయకులు వేండ్ర రమేష్, పాలాటి శరత్‌బాబు పాల్గొన్నారు.

సారాబట్టీలపై దాడులు

గోపాలపురం, జనవరి 6: సారా తయారీ, సరఫరా, విక్రయాలను సహించబోమని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. సారాబట్టీలపై శనివారం దాడులు నిర్వహించి కరగపాడు గ్రామ శివారులో రహస్యంగా ఉంచిన 800లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 40లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

వేళ్లచింతలగూడెం ఎరువుల గోదాములో తనిఖీలు

గోపాలపురం, జనవరి 6: ఎరువుల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని అనపర్తి సహాయ వ్యవసాయ సంచాలకుడు కృష్ణ అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలోని డీసీఎంఎస్ ఎరువులు, పురుగు మందుల గోదామును ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి డీలరు రోజువారి తన వద్ద ఉన్న ఎరువులు, పురుగు మందు స్టాక్ వివరాలు నోటీసుబోర్డులో నమోదు చేయాలన్నారు. ప్రతి రైతు తాను కొనుగోలు చేసిన సరుకుకు సంబంధించి బిల్లులు పొందాలని, ఎరువులు కొనేటప్పుడు ఆధార్ నెంబరు నమోదు చేసి వేలిముద్ర వేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి రాజారావు, దివ్యవాణి, మేనేజర్ రాజు తదితరులున్నారు.

గోపాలపురంలో క్రికెట్ టోర్నమెంట్

గోపాలపురం, జనవరి 6: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నిడదవోలు, జనవరి 6: నిడదవోలులోని రోటరీ ఆడిటోరియమ్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శ్రీవిద్య సుమారు 93 మందిని పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, శివకుమార్, పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, కాశ్య రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, ఎండీ ఫయాజ్ పాల్గొన్నారు.

సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు

రాజమహేంద్రవరంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్, భవాని చారిటబుల్ ట్రస్ట్, సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు శనివారం జరిగాయి. పోటీలకు విచ్చేసిన అతిథులకు స్వాగతం పలుకుతున్న, విజేతలైన వారికి కన్సోలేషన్ బహుమతులు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, సిబ్బంది.. -రాజమహేంద్రవరం సిటీ












అంగన్‌వాడీ సిబ్బందిపై 'ఎస్మా' అప్రజాస్వామికం

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ
- ఎస్మా పత్రాలను దహనం చేసిన అంగన్వాడీలు
- గోపాలపురంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన
- 26వ రోజు కొనసాగిన సమ్మె



కొవ్వూరులో ఎస్మా కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు

కొవ్వూరు, జనవరి 6: అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీల సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా పత్రాలను అంగన్వాడీలు దహనం చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ ఆధ్వర్యంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు సీహెచ్ రమేష్ మాట్లాడుతూ శాంతియుతంగా సమ్మెచేస్తున్న అంగన్వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికమని, సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను నిషేధిస్తూ, సమ్మె కాలానికి వేతనాల్లో కోత విధించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సీహెచ్ పుష్పావతి, బి.పద్మజ, బి.వసంత, సీహెచ్ బ్రహ్మమ్మ, వి.శ్రీదేవి, సీహెచ్ భవాని, కేఈ లక్ష్మి, జి.నేలమ్మ, డి.రమణ, వై.మధురవల్లీ పాల్గొన్నారు.

నిడదవోలు: ఎస్మాకు భయపడే ప్రశక్తే లేదని, అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. శనివారం సాయంత్రం నిడదవోలులో ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తు ప్రభుత్వం ఎస్మాను ప్రకటించి జీవో నెం.2ను జారీచేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో జి.డానియేలు, గంటి శ్రీనివాసరావు, ఉస్మాన్ పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిడదవోలులో ఎస్మా కాపీలను దహనం చేస్తున్న సీపీఎం శ్రేణులు

దేవరపల్లి: దేవరపల్లిలో నిర్వహించిన సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు గడ్డితింటూ ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రత్నాజీ, అంగన్వాడీ మండల కన్వీనర్ టీపీ లక్ష్మి మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. పద్మకామేశ్వరి, కుమారి గంగాభవాని, సావిత్రి పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలో నిర్వహించిన సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఒంటికాలిపై నిలబడి నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు.

పెరవలి: అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శనివారం 26వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పెరవలిలో 26 అంకె సూచించే విధంగా వారు కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకుల మాట్లాడుతూ తమను బెదిరించి, భయపెట్టి సమ్మెను విరమింపజేయాలని ప్రయత్నిస్తున్నారని, తమ డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు.

'ఎస్మా'ను ఎత్తివేయాలి

నంబూరి శ్రీమన్నారాయణ

కొవ్వూరు, జనవరి 6: జీవో నెంబరు-2 ద్వారా అంగన్వాడీల సమ్మెను అత్యవసర సర్వీస్ మెయింటెనెన్స్ చట్టం (ఎస్మా) కింద నిషేధించడం అప్రజాస్వామికమని, ఎస్మాను ఎత్తివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కనీసం వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు చేయకుండా సమ్మెను ఎస్మాతో నిషేధించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం చట్టవ్యతిరేకమైన పాలన కొనసాగిస్తూ నిరుద్యోగులైన అంగన్వాడీలు తమ న్యాయమైన కోర్కెల సాధనకై చేస్తున్న సమ్మెను ఉక్కు పాదంతో అణచివేయడాన్ని ప్రజా వ్యతిరేక చర్య అన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల బతుకు అత్యవసర మెయింటెనెన్స్‌గానే పరిగణించాలన్నారు. ఆర్టికల్ 21ను విస్మరించి వారిపై ఎస్మా ప్రయోగించడం అత్యంత ఘోరమన్నామన్నారు. చిరు ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించడం చట్ట వ్యతిరేక పాలన కిందకు వస్తుందన్నారు.



దేవరపల్లిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గోపాలపురంలో ఒంటికాలిపై నిలబడి నమస్కారం చేస్తూ అంగన్‌వాడీల నిరసన



పెరవలిలో 26 అంకె ఆకారంలో కూర్చున్న అంగన్‌వాడీలు

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కదలి రావాలి

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



నిడదవోలు, జనవరి 6: మన రాష్ట్రాన్ని ఈ సైకో పాలన నుంచి కాపాడుకు నేందుకు ప్రతిఒక్కరు కదలి రావాలని అవినీతి అరాచక పాలనను తుదముట్టించడం మనందరి బాధ్యత అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై వారిని చైతన్యపరిచేందుకే టీడీపీ జయహో బీసీ కార్యక్రమాలతో ముందుకు వచ్చిందన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన పార్టీ టీడీపీ అని, వైసీపీ ప్రభుత్వంలో బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని, దాదాపు 52శాతం పైగా ఉన్న బీసీలు, మైనార్టీలు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. కదలి రా, జయహో బీసీల పేరుతో ఈ నెల 29 వరకు 22 పార్లమెంటు స్థానాల్లో చంద్రబాబు బహిరంగ సభలు నిర్వహిస్తున్నారన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ తదితర్లు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి మాట్లాడారు. బీసీలను చైతన్య పరిచేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు జయహో బీసీ కార్యక్రమాన్ని చేపట్టారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తారన్నారు. రాష్ట్రంలో 52శాతం ఉన్న బీసీలకు జగన్‌రెడ్డి ప్రభుత్వం వెనుబాటుతనం చూపించిందని, నామినేటెడ్ పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికే పెద్దపీట వేసిందని ద్విసభ్య కమిటీ సభ్యులు చెప్పారు. రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, కాగిత రఘు, బొండాడ సత్యనారాయణ, వేమగిరి వెంకట్రావు, తుంపల్లి ఆదినారాయణ, కె.బాలకృష్ణ, పాకా జయరామ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల: నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేర్ల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడారు. రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కదలి రావాలన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడితప్పిందని, దాన్ని సెట్ రైట్ చేయాలంటే బాబే సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో యద్దనపూడి బ్రహ్మరాజు,పసుమర్తి రతీష్,లంకా సత్యనారాయణ పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని భీమోలు, వేలచింతలగూడెం గ్రామాల్లో కమిటీ అధ్యక్షులు అప్పారావు, రాంబాబు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగిన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం కోసం నాయకులు, కార్యకర్తలు పని చేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండలాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో పొర్లు దండాలు

- మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల నిరసన
- 12వ రోజు కొనసాగిన సమ్మె



కొవ్వూరులో కళ్లకు గంతలు, చేతిలో వేపాకులతో కార్మికులు నిరసన

కొవ్వూరు, జనవరి 6: మున్సిపల్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని పొర్లు దండాలు పెడుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకుని, వేపాకులు చేతబట్టి పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్మిక సంఘం నాయకులు రాజాన అప్పారావు, భూపతి రవీంద్ర మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం రోజుకు రూ.వెయ్యి ఇచ్చి కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు కుతూహలంగా ఉందన్నారు. కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పోలీసు నిర్బంధాన్ని ప్రయోగిస్తూ తన దుర్మార్గపు చర్యలను చాటుకుంటుందన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పూజారి వాసు, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, ఎ.వి జయకుమార్, శివశంకర్, ఎ.పూర్ణ, కె.ప్రసాద్, ఎం.శ్రీను, వి.శ్యాం పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల సమ్మె దీక్షా శిబిరాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రేఖా భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



నిడదవోలులో నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఉండ్రాజవరం, జనవరి 6: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. శనివారం వడ్లూరులో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ, సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, నాయకులు వేండ్ర రమేష్, పాలాటి శరత్‌బాబు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

బిక్కవోలు, జనవరి 6: బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. రెండో రోజు కార్యక్రమాల్లో ఉదయం స్వామి అమ్మవార్లకు వసంతోత్సవం, విశేషోత్సవం, జల కుంకుమోత్సవం, వేంకటేశ్వర వ్రతం, సాయంత్రం గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామి వారి వాహనం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం ప్రత్యేక ఉత్సవం, వారోత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోడానికి వచ్చిన భక్తులు అన్నదానంలో పాల్గొన్నారని ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

ధవళేశ్వరంలో నృత్యప్రదర్శన

ధవళేశ్వరం, జవవరి 6: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ఆలయ నృత్యాన్ని ప్రదర్శించింది. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సకల దేవతా హారతి, పుష్పాంజలి సమర్పించారు. అనంతరం అన్నమాచార్య కీర్తనలకు నృత్యం చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను సత్కరించి, కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగ సురేష్, సాధనాల చంద్రశేఖర్, యర్రమోతు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జనార్దనస్వామిని దర్శించుకున్న మంత్రి వేణు



ధవళేశ్వరం, జనవరి 6: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ పౌర సం బంధాల శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శనివారం ధవళేశ్వరంలో లక్ష్మీజనార్దనస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. రూరల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన అనంతరం మొదటిసారిగా ఆలయానికి విచ్చేసిన మంత్రి వేణుకు అర్చకులు ఎస్వీఎస్ఎన్ ఆచార్యులు, ఆలయాధికారి నాగసురేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్థానిక జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.